# లవ్‌లెటర్

ఆఫీసుకు బయలుదేరిన భర్తను గుమ్మం వరకు సాగనంపి లోపలకొచ్చింది సంగీత.

బడికెళ్ళిన బాబు ఇంకా రాలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. చేయడానికి మరో పనేమీ లేకపోవడంతో వాలుకుర్చీలో కూర్చుని వారపత్రిక పేజీలు త్రిప్పసాగింది. ఆ రోజు మనసు దూదిపింజలా గాలిలో తేలిపోతోంది. హృదయం ఆనందంతో పరవళ్ళు త్రొక్కుతోంది.

"సంగీత!" ఎంత మధురమైన పేరు. పేరేనా?.... రూపం కూడ. ఆమె అత్యంత అపురూప సౌందర్యరాశి. పేరుకు తగ్గట్టు ఆమె జీవితం కూడ సంగీత సుధే. ఎక్కడా అపశృతులు లేవు ప్రతి రాగం లయబద్ధం. ప్రతి కదలిక కన్నుల పండుగ.

తెరిచిన పుస్తకం మూసింది. మళ్ళీ ఆలోచనలు... తన జీవితం విప్పారిన పారిజాత పుష్పమంటుంది పొరిగింటి మీనాక్షమ్మ. నిజమే. తన కామెలా కుటుంబ సమస్యలు గాని, ఆర్థిక ఇబ్బందులు గాని లేవు. తన భర్త సుధాకర్ గొప్ప హెూదాలో వున్న ప్రభుత్వోద్యోగి. సంగీత అంటే అతడికి ప్రాణం. వారి అనురాగానికి చిహ్నంగా ప్రేమకు ప్రతిరూపంగా ఏడాది తిరక్కుండానే పండంటి బాబు. వారి ఆనందం అంచులు దాటింది. వారికి ప్రతి పగలు పండుగ. ప్రతి రేయి పున్నమిరేయి. ప్రతిక్షణం మధురాతిమధురం. బ్రతుకే ఒక రంగుల స్వప్నం. జీవితమే వసంతం ఇలా తన బ్రతుకులోని మాధుర్యాన్ని మననం చేసుకుంటున్న సంగీత "పోస్ట్" అనే కేకవిని ఉలిక్కిపడింది.

పోస్టుమాను ఏదో కవరిచ్చి వెళ్లి పోయాడు.

ఆత్రంగా కవరు చించి ఉత్తరం కేసి దృష్టి సారించింది.

డియర్ సుధా!

నీ కోసం ఎదురు చూసి చూసి కళ్ళు కాయలు కాచాయి మనం కలిసి గడిపిన మధుర క్షణాలప్పుడే మరచిపోయావా? నీ రాకకోసం నా మనసు, నీ పొందుకోసం నా తనువు అనుక్షణం తపించిపోతున్నాయి. పరుగు పరుగున వచ్చి నీఒడిలో వాలిపోవాలనిపిస్తుంది. నిన్ను విడిచిపెట్టి మరి వుండలేను. అనుకున్నట్లు నన్ను నీతో ఎక్కడికైనా తీసుకుపో. నీ సన్నిధిలో ఎడారైనా అది నాకు నందనవనమే. నా ఆరాటాన్ని అర్థం చేసుకుంటావని, వెంటనే రెక్కలు కట్టుకొచ్చి నా ముందు వాలుతావని ఆశిస్తున్నా. నీ రాక కోసం వళ్లంతా కళ్ళు చేసుకొని మరీ ఎదురు చూస్తూ వుంటానని మరచిపోకు.

ఇట్లు

నీ సుప్రియ.

ఉత్తరం చదివిన సంగీతకు మతిపోయింది. ముఖం చెమటలు పట్టింది. శరీరంలో రక్తప్రసరణ నిలిచిపోయిందేమో ననిపించింది. ఆ షాకు నుండి తేరుకోడానికి చాలా సేపు పట్టింది.

మళ్లీ ఆలోచనలు....

ఎవరీ సుప్రియ?...... ఆమెకు తన భర్తకు ఏమిటి సంబంధం?.... ఎన్నాళ్ళ నుండి సాగుతోందీ గ్రంధం? సౌందర్యం అంటే సంగీత అని, ఆనందమంటే తన జీవితమేనని భ్రమించింది. అంతలోనే ఏమిటీ విపరీతం? తన మాటలు తేనెకంటె మధురమని, తన నవ్వు గలగల పారే సెలఏరులాంటిదని, తన నడక రాజ హంసల్ని సహితం మరిపిస్తుందని భర్త పొగుడుతూ వుంటే తన కేదో గర్వం, మరోదే సిగ్గు ముంచుకొచ్చేది. ఇప్పుడదంతా "నటన" అని అనుకుంటూ వుంటే ఏడుపొస్తోంది. ఎర్రగా వున్న ఆమె మోము మరింత అరుణిమదాల్చింది. క్షణం ముందు తనకే సమస్యలు లేవు. అంతలోనే... మరి ఆలోచించలేకపోయింది.

బడి నుండి బాబు రావడంతో గృహకృత్యాలలో లీనమైంది. పనులన్నీ యాంత్రికంగా జరిగిపోతున్నా మనసు మాత్రం తన స్వాధీనంలో లేదు. ఏదో విలువైన వస్తువు పోగొట్టుకున్నట్లు బాధ. ఏదో చేసేయాలని తపన. ఆఫీసు నుండి శ్రీవారు రాగానే ప్రేమలేఖ సంగతి తేల్చిపారేయాలని నిర్ణయించుకుని బరువుగా శ్వాసించింది.

సాయంత్రమౌతూ వుంటే ఆమెలో అవ్యక్తమైన సంచలనం ప్రారంభమయింది.

"సంగీతా, ఇంకా ఇలాగే వున్నావా?..... పిక్చరుకు వెళదామన్నావ్. టిక్కట్లుకూడా..." అంటూ లోపలకొచ్చాడు సుధాకర్.

"........................"

"అలా వున్నావేం సంగీతా? వంట్లో బాగోలేదా" చేయి అందుకున్నాడు సుధాకర్.

విదిలించుకుంది సంగీత. అతడి మాటలు ఆమెకే మాత్రం రుచించడంలేదు. అదే మునుపైతే భర్త పలుకులకు బూరిలా ఉబ్బి పోయేది. పాలలా పొంగిపోయేది. వెన్నలా కరిగిపోయేది.

"ఆలశ్యమైందని కోపమా?" ఆమె చుబుకాన్ని వ్రేలితో మీటాడు.

"నాకు కోపమొస్తే మీ కొరిగే నష్టమేముంది?"

"ఏమిటా మాటలు. పెళ్లినాటి నుండి ఇంతవరకు మన మధ్య ఏ అరమరికలు లేవు. నిత్యం చిరునవ్వుతో స్వాగతం పలికే నువ్వేమిటిలా మాట్లాడుతున్నావ్? నిన్ను నా కంటిపాప కంటె పదిలంగా చూసుకుంటున్నాన్న సంగతి తెలియదా?"

"ఈ మాటలే ఎంత మందితో అంటున్నారు" అసహనంగా పలికింది సంగీత.

అవాక్కైపోయాడు సుధాకర్. వెంటనే తేరుకుని "ఎనిమిదేళ్ళు నాతో కాపురం చేసి నన్ను అర్ధం చేసుకున్నదిదన్న మాట" అన్నాడు.

"మనిషిబుద్ధి అందులో మగబుద్ధి ఎప్పుడూ ఒకే మాదిరిగా వుంటుందనుకోవడం అవివేకం."

"సంగీతా!"

"ఎందుకలా ఆవేశపడతారు? నేను అడిగిందాంట్లో వీసం కూడా పొల్లుపోదని ఈ ఉత్తరమే చెబుతుంది" చీరచెంగున దాచివుంచిన ఉత్తరాన్ని బయటకు తీసింది.

ఉత్తరం చూసి నిశ్చేష్టుడయ్యాడు సుధాకర్.

"నేనే మీ సర్వస్వం అన్నారు. నేను లేకుండా బ్రతకలేనన్నారు. ఇటువంటి మాటలు ప్రతి మగవాడు మగువను వశపరచుకునేందుకు వాడే సాధనాలని నాకిప్పుడే అర్థమయింది.

"సంగీతా"

"ఇంత ప్రత్యక్ష నిదర్శనం కళ్ళముందుండగా ఇంకా మిమ్మల్ని అమాయకంగా నమ్మమంటారా?"

"నిజం చెబుతున్నాను. సుప్రియ ఎవరో నాకు తెలియదు. నాకే పాపం తెలియదు. నన్ను నమ్ము సంగీతా."

"ఈ దేశంలో ప్రతి స్త్రీ ఇలాగే భర్త మాటలు వెర్రిగా నమ్మడం. అమాయకంగా ఆరాధించబట్టే మీ మగవారి ఆటలు సాగుతున్నాయి. నాకు ఇంకేమీ చెప్పవద్దు. బాబును తీసుకుని రేపు మా వూరు వెళ్ళి పోదామనుకుంటున్నాను. మీరు సుప్రియను తెచ్చుకుని సుఖంగా వుండండి. నేను చదువుకున్నదాన్ని. ఏ చిన్న ఉద్యోగం చేసైనా బాబును పెంచగలను" అంది సంగీత. ఆమె కళ్ళు శ్రావణ మేఘాలయ్యాయి.

"సంగీత! త్వరపడి నిర్ణయాలు తీసుకోకు నువ్వు లేకుండ నేను జీవించలేను. నువ్వు వెళ్ళిన మరుక్షణం విషం పుచ్చుకుని చచ్చిపోతాను."

"ఇంకా నన్ను మభ్య పెట్టడానికి ప్రయత్నించకండి" కళ్ళు వత్తుకుంటూ ఉన్నది సంగీత.

మరి వారి మధ్య మాటలు లేవు.ఆ రాత్రి ఎవరికీ కంటినిండా కునుకు పట్టలేదు.

ఉదయం లేస్తూనే బేగు సర్దుకుంది సంగీత. అప్పుడే సరళ రిక్షాదిగి లోపలకొచ్చింది.

మరదలి రాకను గమనించనట్లు నటించాడు సుధాకర్.

చెల్లెల్ని సాదరంగా ఆహ్వానించి కాఫీ ఇచ్చింది సంగీత.

అక్కా బావ మాట్లాడుకోవడం లేదని తను వచ్చిన పదినిమిషాలలోనే గ్రహించింది సరళ.

"ఏం బావ అలా వున్నావ్? రాత్రి నిద్ర పట్టలేదా?"

"ఎలా పడుతుంది. మీ అక్క నాతో పోట్లాట పెట్టుకుంది. ఎవరో సుప్రియట. ఆ పేరే నేనెక్కడా వినలేదు. ఆమె నాకు ప్రేమలేఖ వ్రాసింది. శ్రీవారికి వచ్చిన ప్రేమ లేఖ చదివి మీ అక్క ఉగ్రరూపం దాల్చింది. మరో అరగంటలో విడాకులు కూడ ఇవ్వబోతోంది" జరిగిందంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు సుధాకర్.

సంగీత మాట్లాడలేదు.

"అయిందీ, నేననుకున్నంతపని జరిగిందన్నమాట. అందుకే పనిగట్టుకుని ప్రొద్దున్నే వచ్చాను. పిచ్చిబావా ఆ లవ్ లెటర్ సాక్షాత్తు మీ మరదలు సరళే వ్రాసింది."

సుధాకర్ దంపతులు ఆశ్చర్యంతో ఒకరిముఖాలొకరు చూసుకున్నారు.

"మిమ్మల్ని ఏప్రిల్ ఫూల్ చేద్దామని అలా రాసాను." ఆట పట్టిస్తున్నట్లుగా అన్నది సరళ.

"అమ్మదొంగా ఐతే, ఇది నీ పనా!" అంటూ సరళ నెత్తిమీద మొట్టికాయ మొట్టింది సంగీత.

"అమ్మో!" రాగం అందుకుంది సరళ.

అప్పటికి గాని వారికి ముందు రోజు ఏప్రిల్ ఒకటని గుర్తుకు రాలేదు."

*● ఆంధ్రపత్రిక ఆదివారం అనుబంధం, 26–3–89.*